క్లుప్తంగా

ప్రత్యేక పూజలు



సుంకులమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : మండలంలోని రామకొండ సమీపంలోని కొలువైన సుంకులమ్మ ఆలయంలో ఆదివారం మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకుడు శభాష్‌పురం రాఘవరెడ్డి కూతురు రిత్విక జన్మదినం సందర్భంగా చిన్నారిని ఆశీర్వదించారు.

దేవరగట్టులో విశేష పూజలు

హొళగుంద: దేవరగట్టు మాళ మల్లేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం విశేష పూజలు జరిగాయి. స్థానికులే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు తరలి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు.

నేటి నుంచి ఓబులేసుడి ఉత్సవాలు



తొగలుగల్లులో వెలసిన ఓబులేసు స్వామి

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లులో సోమవారం నుంచి బుధవారం వరకు ఓబులేసు స్వామి, ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. సోమవారం గ్రామ దేవతలకు, స్వామి వారికి అభిషేకం, కలశ, పల్లకీ సేవ, మంగళవారం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, మంగళ హారతులు, స్వామి వారి కల్యాణోత్సవం, బుధవారం ప్రభోత్సవం, బుక్కపిండి సేవ, నుగ్గులాట, వసంతోత్సవంతో ఉత్సవాలు ముగుస్తాయని వివరించారు.

4 నుంచి ఆగవేళిలో దేవర

కృష్ణగిరి: మండలంలోని ఆగవేళి గ్రామంలో ఈ నెల 4, 5 తేదీల్లో గ్రామ దేవతల పెద్ద దేవర నిర్వహిస్తున్నట్లు గ్రామస్తులు ఆదివారం తెలిపారు. ఏడేళ్ల తరువాత గ్రామ దేవతలైన పెద్దమ్మ, కర్రెమ్మ, మారెమ్మ, సుంకులమ్మ, రాములమ్మ అమ్మవార్లకు శాంతి కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. 4న అమ్మవార్లకు ప్రతి ఇంటి నుంచి తెచ్చిన నైవేద్యంతో పూజ కార్యక్రమాలు ఉంటాయన్నారు. 5న అమ్మవార్లకు బోనాల సమర్పణ ఉంటుందన్నారు.

ఘనంగా బసవేశ్వరస్వామి రథోత్సవం



రథోత్సవ దృశ్యం

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో ఆదివారం శ్రీ పట్టదస్వామి రథోత్సవం ఘనంగా జరిగాయి. ఉదయం స్వామివారికి ఆకుపూజలు, పంచామృతాభిషేకం, జలాభిషేకం తదితర విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి నందికోలు, ఖడ్గ ప్రదర్శన తదితర పూజా కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం స్వావారి ఉత్సవమూర్తి పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఆలయ పూజారి వీరయ్యస్వామి రథానికి పూజలు చేసి, ఉత్సవమూర్తులను రథంపై అధిష్టింపజేశారు. భక్తుల జయ జయ ధ్వానాల నడుమ స్వామివారి రథ చక్రాలు ముందుకు కదిలాయి. ఎదురు బసవన్న గుడి వరకు రథాన్ని లాగి అక్కడ స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి రథాన్ని యథాస్థానానికి చేర్చారు. ఉత్సవాలను తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

హాజీమలంగ్ బాబా-దర్గాల దివ్యచరితలు పుస్తకావిష్కరణ



పత్తికొండలో పుస్తకావిష్కరణ గావిస్తున్న ప్రముఖులు

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని రమ్య రిసార్ట్‌లో ఆదివారం రిటైర్డు ఉపాధ్యాయుడు ఎస్.మహబూబ్ సాహెబ్ రచించిన హాజీమలంగ్ బాబా–దర్గాల దివ్యచరితలు పుస్తకాన్ని ముఖ్య అతిథులుగా హాజరైన కేడీసీసీ బ్యాంకు మాజీ వైస్ చైర్మన్ ఎస్.రామచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాది ఎల్లారెడ్డి ఆవిష్కరించారు. డాక్టర్ బోలుగద్దె అనిల్‌కుమార్ అధ్యక్షతన జరిగిన పుస్తకావిష్కరణ సభలో ఆదోని లలిత కళా సేవా సమితి అధ్యక్షుడు జి.నల్లారెడ్డి పుస్తక సమీక్ష చేశారు. హాజీమలింగ్ బాబా మహిమలను, రచయిత రచనా శైలిని పలువురు వక్తలు అభినందించారు. కార్యక్రమంలో కవులు, కళాకారులు ఈశ్వరప్ప, ఇంగళదహాళ్ శివుడు, ఈరన్న, రిటైర్డు తహసీల్దారు షేక్షావలి, రాజా జయచంద్రన్ పాల్గొన్నారు.

కూలీలకు వసతులు కరువు!

- ఉపాధి హామీ కూలీలను వేధిస్తున్న సౌకర్యాల లేమి
- గత నెల ప్రారంభం నుంచి పెరిగిన ఉష్ణోగ్రతలు
- పని ప్రదేశంలో కనిపించని టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు
- ఇంటి నుంచి తెచ్చుకుంటేనే తాగునీరు
- శ్రామికులకు ఎనిమిది వారాలుగా అందని వేతనాలు



ఎండలో పనిచేస్తున్న ఉపాధి కూలీలు

ఆలూరు రూరల్: వేసవి ప్రారంభమవక ముందే ఎండలు మండుతున్నాయి. ఫిబ్రవరి ప్రారంభం నుంచే ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో పని ప్రదేశంలో ఉపాధి కూలీలు తల్లడిల్లుతున్నారు. వేసవి ప్రభావం ఉధృతమవుతున్నా పని ప్రదేశాల్లో వసతుల కల్పనపై అధికారుల్లో చలనం లేకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆలూరు ఉపాధి హామీ క్లస్టర్ పరిధిలోని ఆరు మండలాల్లో 45 వేలకు పైగా మంది కూలీలు రోజు పనికి వెళ్తున్నట్లు ఆ శాఖ అధికారులు వెల్లడిస్తున్నారు.

వైఎస్సార్‌సీపీ హయాంలో ఇలా..

గతంలో ప్రభుత్వం నియోజకవర్గ వ్యాప్తంగా ఉపాధి కూలీలకు అందజేసిన టెంట్లు, ప్రథమ చికిత్స కిట్లు అడ్రస్ లేకుండా పోయాయి. గతంలో వేసవిలో పని ప్రదేశంలో ఉపాధి కూలీలు సేదతీరేందుకు టెంట్లుతో పాటు ప్రథమ చికిత్స కిట్లు పంపిణీ చేశారు. అలాగే వడదెబ్బ నుంచి రక్షణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మజ్జిగ,మంచినీరు సైతం అందించారు. వేసవిలో ఉపాధి కూలీలకు అదనంగా పది నుంచి ఇరవై శాతం వరకు అలవెన్సు ఇచ్చారు. వీటితో పాటు గడ్డపారలు, చెలికలు అందించి కూలీలను ప్రోత్సహించారు. ప్రస్తుతం కూలీలకు ఎలాంటి వసతులు కల్పించకపోవడంతో కొన్నిచోట్ల ఉపాధి పనలుకు వెళ్లేందుకు కూలీలు వెనుకాడుతున్నారు.

రూ.5.5కోట్ల మేర వేతన బకాయిలు..

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 56,477 జాబ్ కార్డులు ఉన్నాయి. 1.06 లక్షల మంది కూలీలు నమోదై ఉన్నారు. గత ఏడు వారాలుగా కూలి చెల్లించలేదు. దీంతో నియోజకవర్గంలో రూ.5,53,84,999 కోట్ల మేర వేతన బకాయిలు ఉన్నాయి. కూలీలకు వేతనాలు సకాలంలో చెల్లించకపోవడంతో వారి జీవనం సాగడం కష్టంగా మారింది. కూలీలకు గరిష్ఠ వేతనం కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పనిచేసినా కూలి గిట్టుబాటు కావడం లేదు.

మండలాల వారీగా కూలీలు, జాబ్‌కార్డులు, పెండింగ్ వేతనాల వివరాలు..

మండలం	జాబ్ కార్డులు	కూలీల సంఖ్య	పెండింగ్ బకాయిలు(రూ.)
ఆలూరు	8,950	15,945	95.43 లక్షలు
ఆస్పరి	11,860	22,000	1.37 కోట్లు
చిప్పగిరి	6,262	11,142	69.74 లక్షలు
హాలహర్వి	9,096	16,179	1.11 కోట్లు
హొళగుంద	8,843	16,415	73.85 లక్షలు
దేవనకొండ	11,473	21,466	96.44 లక్షలు

వసతులు కల్పించాలి



ఉపాధి కూలీలకు పనుల జరిగే ప్రదేశంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలి. తాగునీరు, ప్రథమ చికిత్స కిట్లు అందుబాటులో ఉంచాలి. పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలి. జాబ్ కార్డు కలిగి ఉన్న కూలీలకు 150 రోజుల పనిదినాలు కల్పించి వారికి అలవెన్సులు అందించాలి. పెండింగ్ వేతనాలు వెంటనే మంజూరు చేయాలి

– షాకీర్, సీఐటీయూ మండల నాయకుడు

అలవెన్సులు మంజూరు కావడం లేదు



ఉపాధి హామీ పథకం సాఫ్ట్‌వేర్ మారింది. ప్రస్తుతం పూర్తిగా కేంద్ర ప్రభుత్వం ఆధీనంలోనే పథకం నడుస్తోంది. గతంలో సరఫరా చేసే ప్రథమ చికిత్స కిట్లు, టెంట్లు సరఫరా కావడం లేదు. కూలీలకు వారికింద గరిష్ఠంగా రూ.300 అందేలా చర్యలు తీసుకుంటున్నాం . స్థానిక ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు సేకరించి పని ప్రదేశంలో అందుబాటులో ఉంచాలని సిబ్బందిని ఆదేశించాం. ఎండలు ఎక్కువ కావడంతో కూలీలు ఉదయం 11 గంటలలోపే పనులు ముగించుకునేలా చర్యలు తీసుకుంటాన్నాం. పెండింగ్ బకాయిలు తర్వలో జమ చేస్తారని ఉన్నతాధికారులు నుంచి సూచనలు అందాయి.

– పద్మావతి,ఉపాధి హామీ ఏపీడీ

నేడు ప్రజల అర్జీల స్వీకరణ

ఆలూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తామని ఆర్ఐ బసన్నగౌడు ఆదివారం తెలిపారు. సమావేశానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు,కార్యాలయ సిబ్బంది అందుబాటులో కోరారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

హొళగుంద: మండలంలోని గజ్జహళ్లి గ్రామంలోని బీసీ కాలనీలో ఆదివారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. ఉపాధి హామీ పథకం నిధులు రూ.20 లక్షలతో కాలనీలోని మూడు వీధులో సీసీ రోడ్డు నిర్మాణం పనులను బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా జనరల్ సెక్రటరీ రామలింగ, గ్రామపెద్దలు భూమి పూజ చేశారు.

రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభం

వెల్దుర్తి: శనివారం సాయంత్రం నెలవంక దర్శనంతో ముస్లింల పవిత్ర మాసం రంజాన్ ప్రారంభమైంది. దీంతో నెల రోజుల పాటు ఉపవాస దీక్షలు నిర్వహించే ముస్లింలు ఆదివారం తమ మొదటి రోజు దీక్షను తెల్లవారుజామున 5.13గంటలకు సహెర్ చేసి ఫజర్ నమాజులో దీక్షబూని ప్రారంభించారు. సాయంత్రం 6.31 గంటలకు మగ్‌రిబ్ నమాజు ముందు ఇఫ్తార్‌తో దీక్ష విరమించారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండండి

చిప్పగిరి: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ సతీష్ కుమార్ మహిళలకు సూచించారు. ఈ నెల 8వ తేదీన మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా రక్షణ కోసం వారం రోజుల పాటు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణలో భాగంగా ఆదివారం సైబర్ మోసాలపై చిప్పగిరిలో అవగాహన కార్యక్రమం చేపట్టారు.

హామీలను తుంగలో తొక్కారు



మాట్లాడుతున్న ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి

ఆలూరు: అధికారంలోకి వచ్చేందుకు అలవికాని హామీలిచ్చి.. పాలన చేపట్టి తొమ్మిది నెలలు గడిచినా వాటి ఊసెత్తకుండా తుంగలో తొక్కారని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరూపాక్షి విమర్శించారు. స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణలో ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆలూరు మండల అధ్యక్షుడు కె.మల్లికార్జున ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి తొమ్మిది నెలలు గడుస్తున్నా పూర్తిస్థాయిలో హామీల అమలుకు పూనుకోకపోవడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రస్తుత బడ్జెట్ అంకెల గారడీని తలపిస్తోందని, దీని ద్వారా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు పూర్తిస్థాయి నిధులు కాకుండా అరకొరగా కేటాయించడాన్ని చూస్తు ఏదో మతలబు ఉందని అనుమానం వ్యక్తం చేశారు. పాలనను గాలికొదిలేసి కేవలం వైఎస్సార్‌సీపీ నాయకులను వేధించడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. అధికారం శాశ్వతం కాదని, రాజకీయ కక్షలతో రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అలాగే.. వైఎస్సార్‌సీపీ నాయకులకు ఒక్క పని చేసినా సహించేది లేదని అనడం ఆయన నైజాన్ని తెలియజేస్తుందన్నారు. రాజకీయాలు, రాగ ద్వేషాలకు అతీతంగా విధులు నిర్వర్తిస్తానని నాడు ప్రమాణం చేసి నేడు మాత్రమే రాజకీయ పాలన చేస్తానని ప్రకటించారని, దీంతో ఆయనను అనర్హుడుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల కో-కన్వీనర్ వీరేష్, ఐటీ, స్టూడెంట్ యూనియన్ అధ్యక్షులు వరుణ్, రాజు, మాజీ ఎంపీటీసీ భాస్కర్, బాబు, హనుమంతు, మల్లయ్య,రాజు, బాబు, బోయ ఎల్లమ్మ, నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ లోక్‌నాథ్, నాగప్ప పాల్గొన్నారు.

బడ్జెట్.. అంకెల గారడీ



పార్టీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

తుగ్గలి : కూటమి ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అంకెల గారడీలా ఉందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి విమర్శించారు. ఆదివారం మండల సరిహద్దులోని రామకొండ సమీపంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె మాట్లాడారు. ప్రజలను మోసం చేయడమే చంద్రబాబు నైజమనే విషయం బడ్జెట్ ద్వారా మరోసారి నిరూపితమైందన్నారు. సూపర్ సిక్స్ హామీలను విస్మరించి, రైతులు, విద్యార్థులు, యువత, మహిళలు, నిరుద్యోగులు, ఉద్యోగులు ఇలా అన్ని వర్గాలను దగా చేశారని మండిపడ్డారు. తల్లికి వందనం అంటూనే బడ్జెట్‌లో రూ.3వేల కోట్లకు పైగా కోత పెట్టారన్నారు. ఆడబిడ్డ నిధి పథకం ద్వారా 18 ఏళ్ల నుంచి 59 ఏళ్ల లోపు మహిళలకు ప్రతినెల రూ.1500 ఇస్తామని ఎన్నికల ముందు ప్రకటించి ఇంత వరకు ఆ పథకం ఊసూ లేదన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ 20లక్షల ఉద్యోగాలు ఇస్తామని ప్రకటించారని, అంత వరకు ప్రతి నిరుద్యోగికి నెలకు రూ.3వేలు భృతి ఇస్తామని గొప్పగా ప్రకటించారన్నారు. ఎంత మందికి ఉద్యోగాలు ఇచ్చారో, నిరుద్యోగ భృతి ఎంత మందికి చెల్లించారో చెప్పాలని డిమాండ్ చేశారు. వీటికి బడ్జెట్‌లో కేటాయింపులు లేవన్నారు. వైఎస్సార్‌సీపీ వాళ్లకు చిన్న పని చేసినా ఊరుకోను అని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. పార్టీలకు కాదు రాష్ట్రానికి ముఖ్యమంత్రి అని బాబు గుర్తుంచు కోవాలన్నారు. ఆ వాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాడు వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఇచ్చిన హామీల అమల కోసం పరితపించారని గుర్తు చేశారు. తనకు ఓటేయని వాళ్లకు పథకాలు అందించాలని చెప్పి ఆ దిశగా పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత వైఎస్ జగన్‌నే దక్కిందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు జిట్టా నాగేష్, మండల అధ్యక్షుడు అట్ల గోపాల్‌రెడ్డి,ఉడు పులికొండనాయక్, జెడ్పీటీసీ సభ ఇన్‌చార్జ్ ఎంపీపీ ఎర్ర నాగప్ప, నాయకులు జగన్నాథరెడ్డి, మోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, సురేంద్రనాథరెడ్డి, నారాయణనాయక్, సుధాకరరెడ్డి, బసిరెడ్డి పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చాలి

పత్తికొండ రూరల్ : ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏపీ రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజాసాహెబ్, కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మయ్య, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి బి.సురేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని నలకదొడ్డి గ్రామంలో రైతులను కలిసి రైతు సంఘం సభ్యత్వాలను అందజేశారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై పోరుబాటకు సిద్ధం కావాలని కోరారు.

కూలీలూ.. వివరాలు ఇవ్వండి

మద్దికెర : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ప్రతి సంఘంలో 50 మంది కూలీలు ఉండాలని ప్రతి ఒక్కరూ ఆధార్‌కార్డు, జాబ్‌కార్డు, బ్యాంకు ఖాతా తదితర పూర్తి వివరాలు ఉపాధి హామీ పథకం కార్యాలయంలో గానీ, సంబంధిత మేటీకి గానీ అందజేయాలని ఏపీఓ నర్సిరెడ్డి ఆదివారం తెలిపారు. అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామని చెప్పారు. సకాలంలో వేతనాలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని, వ్యవసాయ కూలీలు వలసలు పోకుండా ఉపాధి పనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రైతుల సంక్షేమం కోసం పోరాటాలు

మద్దికెర : రైతుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేస్తామని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రయ్య అన్నారు. ఆదివారం మండలంలోని పెరవలి గ్రామంలో రైతు సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభించారు. రైతు సమస్యలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటాలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వాలు రైతు సంక్షేమం పట్ల నిర్లక్ష్యం విడాలన్నారు. సీపీఐ మండల కార్యదర్శి నాగరాజు, రైతు సంఘం నాయకులు కోదండరాముడు, నాగిరెడ్డి పాల్గొన్నారు.

గుండెపోటుతో సీనియర్ జర్నలిస్టు మృతి

పత్తికొండ రూరల్: పత్తికొండలోని కుమ్మరివీధిలో నివాసం ఉంటున్న గొల్ల రాజానరేష్‌కుమార్ యాదవ్ (51) గుండెపోటుతో ఆదివారం మృతి చెందాడు. కొన్నేళ్లుగా షుగర్ వ్యాధి బారిన పడి అనారోగ్యానికి గురయ్యాడు. ఐదురోజుల కిందట ఆరోగ్య పరిస్థితి సరిగా లేకపోవడంతో కర్నూలులోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కోలుకోలేక అక్కడే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు



గాయపడిన పంపాపతి

ఆలూరు రూరల్: మండలంలోని అరికెర గురుకుల పాఠశాల సమీపంలో ఆదివారం ఉదయం బైక్ అదుపుతప్పి కింద పడి ఇద్దరు యువకులు గాయపడ్డారు. బంధువులు తెలిపిన వివరాలు.. హాలహర్వి మండలం గూళ్యం గ్రామానికి చెందిన పంపాపతి,రాజు ఉదయం పని నిమిత్తం స్కూటర్‌పై ఆలూరుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా అరికెర గురుకుల పాఠశాల సమీపంలో బైక్ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లింది. పంపాపతి తలకు తీవ్రగాయాలు కాగా.. రాజు స్వల్పంగా గాయపడ్డాడు. అటువైపుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించి చికిత్స కోసం ఆలూరు ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన పంపాపతిని మెరుగైన వైద్యం కోసం బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు.

కోర్కెలు తీర్చే సంజీవరాయుడు

- ఆదివారం ప్రారంభమైన ఉత్సవాలు
- రేపు వైభవంగా రథోత్సవం



విశేష అలంకరణలో సంజీవరాయుడు

పత్తికొండ రూరల్ : మండలంలోని జూటూరు గ్రామంలో భక్తుల ఆరాధ్యదైవంగా విరాజిల్లుతున్న సంజీవరాయుడు భక్తుల కోర్కెలు తీర్చే దేవుడుగా ప్రసిద్ధిగాంచాడు. ఈ ఏడాది ఈనెల 4వ తేదీన జరగనున్న స్వామివారి రథోత్సవానికి ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తాదులు అధిక సంఖ్యలో గ్రామానికి చేరుకుంటారు. తిరునాలతో ముందుగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

ప్రారంభమైన ఉత్సవ పూజలు..

ఆదివారం ఉదయం 8గంటలకు స్వామివారికి ఆలయ అర్చకులు నారాయణస్వామి గణపతి పూజ, పుణ్యాహవాచనం, కంకణధారణ, సాయంత్రం కుంభోత్సవం, అంకురార్పన, కళశస్థాపన పూజలు జరిపించారు. సోమవారం రథప్రతిష్టాపన, గ్రహజపము, ధాన్యాధివాసం, సాయంత్రం 5గంటలకు ప్రభోత్సవం, రాత్రి భజన కార్యక్రమాలు ఉంటాయి. 4న మంగళవారం ఉదయం రథాంగ పూజలు ఉంటాయి. సాయంత్రం రథోత్సవం. 5న వసంతోత్సవంతో వేడుకలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు.



బాపనదొడ్డి-కంబాలపాడు గ్రామాల మధ్య విరబూసిన వసంత పూలు

‘వసంతం’ ముందే పూసింది!

కృష్ణగిరి: ఈ పూలను చూస్తే ఉగాది పండుగ గుర్తొస్తుంది. ఉగాది వేడుకల ముగింపు రోజు ప్రతి గ్రామంలో వసంత మహోత్సవం చేసుకోవడం ఆనవాయితీ. గ్రామంలోని అందరూ ఐకమత్యంగా ఉండాలనే సంకల్పంతో వసంతోత్సవం జరుపుకుంటారు. గతంలో ఈ పూలను సేకరించి, ఎండబెట్టి తరువాత పొడి చేసి పండుగ రోజున నీళ్లలో నానబెట్టి వసంతోత్సవంలో ఆ నీటిని చల్లుకుంటూ సంబరాలు చేసుకునేవారు. ఈ నీళ్లు పడితే ఆ ఎరుపు రంగు బట్టలు పూర్తిగా చినిగిపోయినా పోయేది కాదు. నాడు సహజసిద్ధ ఉత్పత్తులతో వసంతోత్సవం జరుపుకునేవారు. క్రమేణా ఈ పూలను వసంతోత్సవంలో వాడటం అరుదుగా మారింది.


ఘనంగా సామూహిక వివాహాలు



సామూహిక వివాహాల్లో ఒక్కటైన కొత్త జంటలు

హాలహర్వి: మండలంలోని జె.హొసళ్లి గ్రామంలో ఆదివారం శ్రీ పట్టదస్వామి పీఠాధిపతి శ్రీ శంభులింగస్వామి ఆధ్వర్యంలో సామూహిక వివాహాలు ఘనంగా జరిగాయి. వివాహానికి ముందు పండితులు పట్టదస్వామి వారికి పూజలు చేశారు. అనంతరం హోమం జరిపించారు. తదనంతరం పండితుల వేద మంత్రాల నడుమ ఐదు జంటలు ఒక్కటయ్యాయి. ఈ సందర్భంగా పీఠాధిపతి శ్రీ శంభులింగస్వామి మాట్లాడుతూ ఏటా శివరాత్రి ఉత్సవాల సందర్భంగా స్వామివారి ఆశీస్సులతో నిరుపేదలకు సామూహిక వివాహాలు జరిపిస్తున్నట్లు తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు వీరేష్, సోమన్న, సిద్ధుస్వామి, పడదయ్యస్వామి పాల్గొన్నారు.

వలస విద్యార్థుల కోసమే సీజన్ హాస్టల్



సీజనల్ హాస్టల్‌ను పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీనివాసరెడ్డి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈఓ రమేష్

హాలహర్వి: వలస విద్యార్థుల కోసమే సీజనల్ హాస్టల్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎంఈఓ శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం రమేష్‌నాయుడు అన్నారు. ఆదివారం మండలంలోని నిట్రవట్టి గ్రామంలో ఆంధ్రదేశ్ సమగ్ర శిక్ష సౌజన్యంతో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఇక్కడ 50 మంది విద్యార్థులకు వసతితోపాటు భోజన సౌకర్యం ఉందన్నారు. 50 మంది ఉండాల్సిన సెంటర్‌లో ఉషోదయ గ్రామీణ అభివృద్ధి సంస్థ అదనంగా మరో 13 మందికి వసతితో పాటు భోజన సౌకర్యం కల్పించడం సంతోషించదగ్గ విషయమన్నారు. సంస్థ వ్యవస్థాపకులు సి.హెచ్.నాగరాజు, ఉపాధ్యాయుడు కె.అయ్యన్నగౌడ్ పాల్గొన్నారు.

సీజనల్ హాస్టళ్ల తనిఖీ

పత్తికొండ రూరల్ : మండలంలోని పుచ్చకాయలమాడ, దూదేకొండ, పందికోన గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీజనల్ హాస్టళ్లను ఎంఈఓ గాజుల రమేష్ ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు పట్టిక, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారంగా విద్యార్థులకు భోజనం వడ్డించాలని, విద్యార్థులను సక్రమంగా చూసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. హెచ్‌ఎం కర్రిబసప్ప ఉన్నారు.

- **హొళగుంద:** స్థానిక కొండ కాలనీలోని కడ్లమాగి పాఠశాల భవనంలో ఉషోదయ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో అంబేడ్కర్, వరలక్ష్మి సెల్ఫ్ గ్రూపులు నిర్వహిస్తున్న సీజనల్ హాస్టల్‌ను ఎంఈఓ-2 జగన్నాథం ఆదివారం తనిఖీ చేశారు. విద్యార్థులను అడిగి వసతి, బోధనను అడిగి తెలుసుకున్నారు. సొసైటీ వ్యవస్థాపకుడు చిన్నహ్యాట నాగరాజు, టీచర్లు సోహెబ్, దుర్గయ్య ఉన్నారు.



ఎద్దుల బండిపై ప్రసాదాన్ని ఊరేగిస్తున్న దృశ్యం



కిస్తీ వేడుకలను తిలకిస్తున్న భక్తులు

పులకించిన పోతుగల్లు

- వైభవంగా కిస్తీ వేడుకలు

కృష్ణగిరి: కొలిచే వారికి కొంగు బంగారమైన ఇమాం కాశిం ఉరుసును గ్రామస్తులు వైభవంగా జరుపుకుంటున్నారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం కిస్తీ వేడుకలు గ్రామస్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. కిస్తీకి సంబంధించిన ప్రసాదాన్ని ప్రత్యేకంగా అలంకరించిన ఎద్దుల బండిపై దర్గా దగ్గరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం స్వామి దర్గాలో పూజలు నిర్వహించి ప్రసాదాన్ని కిస్తీ పాత్రలో పోశారు. ఈ దృశ్యాన్ని తిలకించేందుకు భారీగా భక్తులు రావడంతో దర్గా ఆవరణం కిక్కిరిసింది. మూడు రోజులుగా జరిగిన ఉత్సవాలు ఈ కార్యక్రమంతో ముగిశాయని గ్రామస్తులు తెలిపారు.